## క్లుప్తంగా

### భారీ వర్షానికి రోడ్లు జలమయం



వర్షానికి జలమయమైన అల్లిపురం రోడ్డు

**అల్లిపురం** : ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నియోజకవర్గంలో కాలువలు పొంగి పొర్లాయి. రోడ్లపై వర్షం నీరు ప్రవహించడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు రావటంతో భూపేష్‌నగర్, చావుల మదుం, ప్రసాద్ గార్డెన్స్, పాత నగరంలో కొన్ని ప్రాంతాలు జలమయం అయ్యాయి. తర్వాత వర్షం తగ్గటంతో ఆయా ప్రాంతాల్లో వర్షం నీరు తగ్గుముఖం పట్టింది. చాలా రోజులకు వర్షం కురవటంతో నగరం చల్లబడిందని పలువురు అభిప్రాయపడ్డారు.

### నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గంతో కొణతాల శ్రీనివాస్

**డాబాగార్డెన్స్** : ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ అధ్యక్షుడిగా పిల్లా నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్యామ్, కోశాధికారిగా రాజుని నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ మాట్లాడుతూ మేలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని తెలిపారు. ఆ కార్యవర్గం ద్వారా ఇప్పుడు ప్రతి నియోజకవర్గంలో నియోజకవర్గస్థాయి అధ్యక్షులను నియమిస్తూ, వారి ద్వారా వార్డు అధ్యక్షులను నియమించుకుంటూ ప్రతి వార్డులోను బీసీలకు ఏ సమస్య వచ్చినా, బీసీ సంక్షేమ సేవా సంఘం ముందుండి పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

### విబ్జా ఆవిర్భావం

**మహారాణిపేట** : విశాఖపట్నం బ్రాహ్మణ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (విబ్జా) ఆవిర్భవించింది. నగరంలో పాత్రికేయ వృత్తిలో ఉన్న బ్రాహ్మణ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటైన ఈ నూతన సంఘానికి తొలి అధ్యక్షుడిగా వార్తావళి తెలుగు దినపత్రిక సంపాదకుడు బులుసు సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏర్పాటైన సంఘ విస్తృత స్థాయి సభ్యుల సమావేశంలో ఏకగ్రీవంగా తొలి కార్యవర్గం ఎన్నికయింది. గౌరవ అధ్యక్షులుగా సూరంపూడి వీరభద్రరావు, రామచంద్రరావు, గౌరవ సలహాదారులుగా సీనియర్ పాత్రికేయులు కేసనపల్లి కోటేశ్వరరావు, వేదుల నరసింహమూర్తి, కేబీజీ శ్రీనివాస్ వ్యవహరించనున్నట్లు కమిటీ తెలిపింది.

### సిద్ధమవుతున్న కొండంత హనుమంతుడు



హనుమంతవాక వద్ద సిద్ధమవుతున్న ఆంజనేయస్వామి విగ్రహం

**ఆరిలోవ**: హనుమంతవాక వద్ద పేరుకు తగినట్టు హనుమాన్ విగ్రహం రూపుదిద్దుకుంటోంది. సుమారు 40 అడుగుల ఎత్తులో ఆంజనేయ స్వామి విగ్రహం ఇక్కడ సిద్ధమవుతోంది. బీఆర్‌టీఎస్ కూడలి సమీపంలో ఆరిలోవ వైపు వెళ్లే రోడ్డు పక్కన జీవీఎంసీ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహం అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటోంది.



# భవితకు దిక్సూచి

- 7200 గ్రంథాలతో విద్యార్థులకు అందుబాటులో అల్లిపురం శాఖా గ్రంథాలయం
- లైబ్రరీలో కొలువుదీరిన కాంపిటీటివ్ పుస్తకాలు.. నవలలు.. పిల్లలకు నచ్చే సాహిత్యం
- సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుల పిలుపు

చక్కటి పుస్తకం.. మంచి నేస్తం అన్నారు పెద్దలు. చిన్న పుస్తకం ప్రపంచాన్ని మన అరచేతిలో నిలుపుతుంది. దూరతీరాల్లోని సమాచారాన్ని మనకు అందజేస్తుంది. మేధకు పదును పెట్టి ఉత్తమంగా రాణించేందుకు దోహద పడుతుంది. అలాంటి విలువైన పుస్తకాల భాండాగారమే అల్లిపురం శాఖా గ్రంథాలయం. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు, మహిళలు ఇష్టపడే నవలలు, పిల్లల సాహిత్యంతో అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా ఈ గ్రంథాలయం పూర్తి సేవలందిస్తోంది.



విద్యార్థులకు ఉపయోగపడే కాంపిటీటివ్ పుస్తకాలు



లైబ్రరీలో పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు

**అల్లిపురం** : విద్యార్థులకు దిక్సూచులు గ్రంథాలయాలు. మంచి కొలువులు పొందాలంటే తప్పనిసరిగా ఇతరులతో పోటీ పడాల్సిందే. అందుకు ఎంతో ఖరీదైన పుస్తకాలు కొని చదవాలి. అయితే అందరికీ అటువంటి పరిస్థితులు ఉండకపోవచ్చు. దీన్ని గమనించి గ్రంథాలయ సంస్థ వేలాది రూపాయలు వెచ్చించి విద్యార్థులకు అవసరమైన కాంపిటీటివ్ పుస్తకాలను సమకూర్చింది. పై చదువులు చదవాలనుకునేవారు, కోరుకున్న ఉద్యోగాలు సంపాదించాలనుకునే వారికి ఉపయుక్తమయ్యే అన్ని సబ్జెక్టులకు సంబంధించిన విలువైన గ్రంథాలు లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి.

**7200 పైచిలుకు పుస్తకాలు..**

అల్లిపురం, బాయమ్మ జంక్షన్‌లో జిల్లా గ్రంథాలయానికి అనుబంధంగా శాఖా గ్రంథాలయం నిర్వహిస్తుంది. ఈ గ్రంథాలయంలో ఇప్పటికే 6,300 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి తోడుగా ఇటీవల మరో 975 కాంపిటీటివ్ పుస్తకాలు సమకూర్చినట్లు గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు తెలిపారు. ఇటీవల వాటిలో బాల సాహిత్యం, పురాణాలు, గ్రంథాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు, విద్యార్థులు, కాంపిటీటివ్ పరీక్షలకు సన్నద్ధమయ్యే స్టూడెంట్స్‌కు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. త్వరలోనే మరికొన్ని పుస్తకాలు చేర్చనున్నట్లు పేర్కొన్నారు.

**తెరిచి వుండే వేళలు..**

ఈ గ్రంథాలయం ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి వుంటుందని గ్రంథాలయాధికారి రాజు తెలిపారు. పేపరు విభాగం దిగువ, పుస్తక విభాగం మేడపైన నడుపుతున్నారు. ప్రతి శుక్రవారం సెలవు. మిగిలిన రోజుల్లో విద్యార్థులు, కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధపడే వారు కోరితే పుస్తక విభాగం తెరిచి ఉంచుతారు. పాఠకులు నవలలు ఇంటికి తీసుకెళ్లి చదువుకునే వెసులుబాటు కల్పించారు. అందుకు గాను రూ.100 డిపాజిట్ తీసుకుని అందజేస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాయాధికారి కోరుతున్నారు.



బాయమ్మ జంక్షన్‌లో గల అల్లిపురం శాఖా గ్రంథాలయం

### అన్ని రకాల పత్రికలు అందుబాటులో..



శాఖా గ్రంథాలయంలో అన్ని రకాల దిన, వార, పక్ష, మాస పత్రికలు లభిస్తున్నాయి. గ్రంథాలయానికి వచ్చి అన్ని రకాల దినపత్రికలు చదువుకోగలుగుతున్నాం. కాంపిటీటివ్ పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకుంటే బాగుంటుంది.

–పాల శ్రీహరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి

### అవసరమైన అన్ని పుస్తకాలు ఉన్నాయి



మహిళలకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన పుస్తకాలు సభ్యత్వం కట్టి ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చు. నవలలు, మాస పత్రికలు, పిల్లలకు కావాల్సిన కామిక్ పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. గ్రంథాలయం సేవలు అందరూ వినియోగించుకుంటే బాగుంటుంది.

–ఎం.గోవిందమ్మ, గృహిణి

### పోటీ పరీక్షల మెటీరియల్ లభిస్తుంది



నేను కాంపిటీటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. అందుకు కావాల్సిన మెటీరియల్ అల్లిపురం శాఖా గ్రంథాలయంలో లభిస్తుంది. ఇంకా మెటీరియల్ అవసరమైతే రప్పిస్తామని చెప్పారు. గ్రంథాలయంలో చదువుకుంటామంటే అందుకు సహకరిస్తున్నారు. పోటీ పరీక్షలకైనా కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉంది. ఎంతగానో ఉపయోగపడుతుంది.

–కిలపర్తి మధు, అల్లిపురం

### అవసరాన్ని బట్టి మరిన్ని పుస్తకాలు సమకూర్చుతాం



ఇప్పటికే గ్రంథాలయంలో 7200కు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు కావాల్సిన కాంపిటీటివ్ పుస్తకాలు సమకూర్చాం. అవసరమైన పుస్తకాల సమాచారం తెలియజేస్తే వాటిని కూడా సమకూరుస్తాం. మరికొన్ని పుస్తకాలు గ్రంథాలయానికి రానున్నాయి. గ్రంథాలయ శాఖ చైర్మన్ కొండా రమాదేవి నిధులు కేటాయించారు.

–పీవీఎస్ రాజు, గ్రంథాలయాధికారి

## గర్భిణులకు పండ్లు పంపిణీ



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

**డాబాగార్డెన్స్** : జాయింట్ రోటరీ క్లబ్ సెలబ్రేటింగ్ మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ మంత్ పేరిట పలు రోటరీ క్లబ్‌లు ఆదివారం ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులకు పండ్లు పంపిణీ చేశాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ ఎలైట్ అధ్యక్షుడు తోట దుర్గారావు, సెక్రటరీ రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, దొరబాబు, లలిత్‌జైన్, వెంకటరెడ్డి, మహేష్, రాథోడ్, రోటరీ క్లబ్ విశాఖ వేలీ అధ్యక్షుడు రంగరాజు, సమత, లక్ష్మణరావు, నందకిషోర్, చిరంజీవి జైన్, సత్యవాణి, వెంకటేశ్వరరావు, కోట రమేష్, గురువులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆదిత్య అచీవర్స్ డే-2023

**డాబాగార్డెన్స్** : ఈ విద్యా సంవత్సరంలో 2773 ప్లేస్‌మెంట్స్ ద్వారా అద్భుత ఫలితాలు సాధించిన నేపథ్యంలో ఈ నెల 25న బీచ్‌రోడ్డు ఏయూ కన్వెన్షన్ సెంటర్లో 'ఆదిత్య అచీవర్స్ డే–2023'కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎస్. సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ కె. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న కార్యక్రమంలో 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం (ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. కృష్ణమోహన్, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, సీఐటీయూ నాయకులు

**సీతమ్మధార** : మణిపూర్ దారుణకాండలో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించటాన్ని ఖండిస్తూ సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు తులసీరామ్, ఐద్వా కార్యదర్శి కుమారి మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లు జరుగుతూ ఉంటే స్పందించాల్సిన ప్రధాని మోదీ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మణిపూర్ పర్యటన తర్వాత అల్లర్లు మరింత పెరిగాయన్నారు. మణిపూర్‌లో హింసకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## 'మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి'



జ్ఞానాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

**కంచరపాలెం** : మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలపై స్పందించని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ, ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ వెంటనే రాజీనామా చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు జ్ఞానాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ ఆందోళనలో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ), మురికివాడ నివాసీయుల సంక్షేమ సంఘం (ఎంఎస్‌ఎస్‌ఎస్), అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు, అత్యాచారాలు, హత్యాకాండలు జరుగుతున్నా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, జాతీయ మహిళా కమిషన్ పట్టించుకోలేదని ఆరోపించారు. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. మత విద్వేషాలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిస్తున్నాయని ఆరోపించారు. సుప్రీం కోర్టు స్వయంగా విచారణ చేపట్టి దోషుల్ని కఠినంగా శిక్షించాలని, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నేతలు కె. నిర్మల, ఎస్. వెంకటలక్ష్మి, ఇందిర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో కార్యవర్గ సభ్యులు

**డాబాగార్డెన్స్** : రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో 2023–24 ఏడాదికి నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో క్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ కె. కిరణ్‌కుమార్, క్లబ్ కార్యదర్శిగా కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ రోటేరియన్ భాస్కర్ రామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎండాడలో క్లబ్ నిర్వహిస్తున్న మహిళా సాధికారత కేంద్రం, హుకుంపేటలో నిర్వహిస్తున్న గిరిజన మహిళా సాధికారత కేంద్రం ఏర్పాటు చేసిన పూర్వ అధ్యక్షురాలు సునీత లావణ్యను అభినందించారు. కార్యక్రమంలో సునీత లావణ్య, ఎస్. గాయత్రి, మొదిలి మహేష్, మిరియాల వేణు, గోపాల్, డాక్టర్ ఎం. గంగాధర్, పరశురామరాజు, సత్యశ్రీ, పద్మజ, వైవీవీ సత్యనారాయణ, ఎ. కిరణ్, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా సంత్ సమాగమం



బృందగానం ద్వారా సత్య సందేశం ఇస్తున్న చిన్నారులు



మానవ జన్మ లక్ష్యాన్ని లఘు నాటిక రూపంలో ప్రదర్శిస్తున్న చిన్నారులు

**డాబాగార్డెన్స్** : పాతనగరం వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం సంత్ నిరంకారీ మండలి ఆధ్వర్యంలో విశాల యువ–బాలల సంత్ సమాగమం నిర్వహించారు. మండలి హైదరాబాగ్ జోనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి విశాల్ ఖరానా, విశాఖ శాఖ సహ సంయోజకుడు పీవీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 80 మంది యువకులు, బాల బాలికలు పాల్గొని లఘు నాటికలు, బృందగానం, ప్రసంగాలు, కవిత్వాలు నిర్వహించారు. మానవత్వపు గుణాలతో ప్రదర్శించిన లఘు నాటికలు ప్రతినిధులను ఆకర్షించాయి. సద్గురు సత్య సందేశాన్ని మానవాళికి అందించారు. ఈ సందర్భంగా విశాఖ సంత్ నిరంకారీ మండలి సంయోజకుడు ప్రేమ్‌మిర్‌పూరి మాట్లాడుతూ బ్రహ్మజ్ఞానం ద్వారా పరమాత్మను అనుభవపూర్వకంగా తత్వరూపంలో తెలిపారు. మానవ జన్మ లక్ష్యాన్ని నెరవేర్చే ప్రయత్నంపై వివరించారు. నేటి బాలలే భావిపౌరులు కాబట్టి ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యమన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి నిరంకారీ భక్తులు పాల్గొన్నారు.

## నేడు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**డాబాగార్డెన్స్** : నగరంలోని పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుంది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా 30వ వార్డు తాడివీధి నుంచి గరగ డ్యాన్స్, పులివేషాలు, కోలాటం, తీన్మార్ డప్పులతో ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఊరేగింపుగా రానున్నారు.

## సినీ పరిశ్రమకు కోవిడ్ కొత్త పాఠాలు



మాట్లాడుతున్న సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్

**సీతంపేట** : కోవిడ్ మహమ్మారి సినీ పరిశ్రమతో పాటు ప్రేక్షకులకు కొత్త పాఠాలు నేర్పిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో 'కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లల్లో కూర్చొని తమకు నచ్చిన సినిమా వీక్షించే అవకాశం కలిగిందన్నారు. ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం కూడా మారిందన్నారు. ముఖ్యంగా సినిమా హాళ్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మన సినిమాలు ఇతర భాషా చిత్రాలతో పోల్చుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆర్‌పీ జవాబులిచ్చారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు పి.ఎస్.మూర్తి పెన్సిల్‌తో గీసిన స్కెచ్‌ను ఆయనకు బహూకరించారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పట్నాయక్ సంగీత దర్శకత్వం వహించిన పలు చిత్రాలతో త్వరలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జి, కుమారి, అనురాధ, శివన్నారాయణ, చంద్రశేఖర్, రాజీవ్ పాల్గొన్నారు.

## దండాలమ్మ..బంగారమ్మ..



బంగారమ్మ గుడికి పూజారమ్మను తీసుకెళ్తున్న దృశ్యం



మరిడమ్మ, బంగారమ్మకు ఉపారం తీసుకెళ్తున్న మహిళలు

- నేడు తొలేళ్లు..
- రేపు ప్రధాన పండగ

**డాబాగార్డెన్స్** : జీవీఎంసీ 29వ వార్డు పరిధి దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ చదును పట్టు వద్ద బంగారమ్మకు, మరిడమ్మకు విశేష పూజలు జరిపారు. సాయంత్రం 4 గంటలకు చదును పట్టు వద్ద మరిడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దండుబజార్, పీ అండ్ టీ క్వార్టర్స్, చందకవీధి, దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, ప్రకాశరావుపేట, జడ్జికోర్టు, సింగ్ హోటల్ జంక్షన్ మీదుగా పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ గుడి వరకు ఊరేగింపుగా వెళ్లి ఉపారం అందజేశారు. రాత్రి 7 గంటల నుంచి దండుబజార్ డౌన్ రోడ్డులో రేలా రేలా సినీ ఆర్కెస్ట్రా, జానపద గేయాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు గ్రామ పురవీధుల్లో ఉజిడి బండి తిప్పారు.

**నేడు తొలేళ్లు..**

ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు గ్రామ పురవీధుల్లో పూలఘటాలు తిరగనున్నాయి. రాత్రి 7 గంటలకు కూటి ఘటాలు తిరగనున్నాయి. కళావేదిక ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు.

## చలసాని ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న విప్లవ రచయితల సంఘం నేత ప్రసాద్

**సీతంపేట**: మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించి.. పరిశీలించే దృష్టితో చూసినప్పుడే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయని నమ్మే వ్యక్తి చలసాని ప్రసాద్ అని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నేత సి.ఎస్.ఆర్ ప్రసాద్ అన్నారు. మార్క్సిస్టు మేధావి, విప్లవ రచయిత చలసాని ప్రసాద్ 8వ వర్ధంతి సందర్భంగా 'నేటి రాజకీయాలు సాహిత్యం' అనే అంశంపై శనివారం పౌర గ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని చలసాని ప్రసాద్ ముందుగా జీవితానికి అన్వయించుకుని, ఆ దిశగా కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేశారన్నారు. స్టాలిన్ హింసాకాండపై అనేక మంది విమర్శించినప్పటికీ.. చలసాని మాత్రం స్టాలిన్ చేసిందే సరైందని అన్నారని తెలిపారు. ఆ రోజుల్లో స్టాలిన్ ఆ విధంగా వ్యవహరించకపోతే అమెరికా, జర్మనీ కలిసి సోషలిజాన్ని కూల్చివేసేవారని చలసాని చెప్పేవారన్నారు. బీజేపీ అమలు చేస్తున్న మతతత్వ ఫాసిజాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారని గుర్తు చేశారు. వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ పాలకులు హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూ మతం పేరుతో కలహాలు సృష్టిస్తున్నారని చలసాని చెప్పేవారన్నారు. ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు 'చలసాని వ్యక్తిత్వం నిబద్ధత'అనే అంశంపై, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి 'భారతదేశంలో ప్రజాస్వామ్యం, భవిష్యత్' అనే అంశంపై ప్రసంగించారు. ముందుగా చలసాని చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ఇప్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అటవీ హక్కు చట్టం సవరణ తగదు

**ఎంవీపీ కాలనీ**: అటవీ హక్కు చట్టం–1980 సవరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ మాట్లాడుతూ అడవుల నిర్మూలనను నియంత్రించడానికి 1980లో కేంద్రం రాజ్యాంగబద్ధంగా అమలులోకి తెచ్చిన చట్టానికి సవరణలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు 2021లో సంబంధిత మంత్రిత్వ శాఖ చేసిందన్నారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కితీసుకోవాలన్నారు.

### పేదల సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నారాయణరావు

**మహారాణిపేట** : పేదలకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందంజలో ఉండాలని 29వ వార్డు కార్పొరేటర్, స్థాయీ సంఘం చైర్మన్ ఊరుకుటి నారాయణరావు అన్నారు. ఆదివారం షవర్స్ ఆఫ్ బ్లెస్సింగ్ మినిస్ట్రీస్ అండ్ చారిటబుల్ ట్రస్టు 5వ వార్షికోత్సవం సందర్భంగా దండుబజార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ట్రస్టు అనేక సేవలు అందించిందన్నారు. ట్రస్టు సేవలు నిరంతరం కొనసాగాలన్నారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు. బీమ్‌నగర్ ఆశ్రమంలో గల వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కొడూరు రూప, ఫౌండర్ కోన శంకర్, సభ్యులు కర్రి సూరిబాబు, వింజుమూరి కిషోర్, వాడమోదులు రమేష్, కోడూరు మోసెస్, నెల్లి దేముడు, పితాని సూర్యప్రకాష్, అమల, కంటి రమ్య, సత్యాజీ, వెంకటరత్నం, కనకరత్నం, అప్పలకొండ, ఉష తదితరులు పాల్గొన్నారు.